రంజాన్ వేళలు

| | ఇఫ్తార్ | సెహరి |
|---|---|---|
| | శుక్రవారం | శనివారం |
| కర్నూలు | 6:35 | 4:54 |
| నంద్యాల | 6:31 | 4:54 |

# శ్రీగిరిపై ఉగాది ఉత్సవాలు



శ్రీశైలం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో గురువారం ఉగాది మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు జరిగే ఈ ఉగాది మహోత్స వాలు 31న ముగియనున్నాయి. ఉదయం ఆలయ ప్రాంగణంలోని స్వామివారి యాగ శాల ప్రవేశంతో ఉత్సవాలు మొదల య్యాయి. ఆలయ అర్చకులు శివసం కల్పం, పుణ్యాహవచనం, చండీశ్వ రపూజ నిర్వహించారు. సాయం కాలం అంకురార్పణ కార్య క్రమం జరిపించారు. మొదటి రోజు అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమి చ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరిం చాయి. ఉగాది ఉత్సవాలను ఆలయ ఈఓ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

- భృంగి వాహనంపై స్వామి, అమ్మవార్ల విహారం
- మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన భ్రమరాంబికాదేవి
- భక్తులతో కిటకిటలాడిన శ్రీశైల క్షేత్రం



మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు



కళాకారుల ప్రదర్శన



### భృంగివాహనంపై స్వామి, అమ్మవార్లు

ఉగాది ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు గురువారం స్వామిఅమ్మవార్లకు భృంగివాహన సేవ నిర్వహించారు. అర్ధనారీశ్వర రూపానికి మూలకారకుడైన భృంగి భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివార్ల సేవలో తరించారు. క్షేత్రవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అశేష భక్తజనం ఈ అద్భుత ఘట్టాన్ని కనులారా వీక్షించి పరవశించారు. గ్రామోత్సవం ముంగిట శంఖం, జే గంట, ఢమరుకం, కొమ్ము వాయిద్యం, కోలాటం, చెక్కభజన, తప్పెట్లు, శంఖునాదాలు, కర్ణాటక డోలు విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



### నేడు కైలాసవాహన సేవ, మహాదుర్గ అలంకరణ

ఉగాది మహోత్సవాల్లో భాగంగా రెండోరోజైన శుక్రవారం స్వామివారికి విశేష అర్చనలు, మహాశక్తి స్వరూపిని భ్రమరాంబికదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వాహనసేవలో భాగంగా స్వామి, అమ్మవార్లకు కైలాసవాహనసేవ, అమ్మవారు మహాదుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు.





గ్రామోత్సవం ఎదుట కళాకారుల ప్రదర్శన



కర్ణాటక సంప్రదాయ నృత్య ప్రదర్శన

## ధరంటే అధిర..!

రూ.14 లక్షల ధర పలికిన ఒంగోలు గిత్త



ప్యాపిలి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఎద్దుల ధరలు వేలల్లో.. మహా అయితే రూ.2లక్షల్లోపు ఉంటుంది. కానీ ఓ రైతు 'అధిర' అంటూ ముద్దుగా పిలుచుకునే ఒంగోలు జాతి ఎద్దు మాత్రం ఏకంగా రూ.14 లక్షలకు ధర పలికింది. ప్యాపిలి మండలంలోని డి.రంగాపురం గ్రామానికి చెందిన రైతు జూటూరు రామకృష్ణారెడ్డి నుంచి ప్రకాశం జిల్లా నాగుఉప్పలపాడుకు చెందిన రైతు శేషాద్రిచౌదరి గురువారం 'అధిరను కొనుగోలు చేశాడు. 5 సంవత్సరాల వయస్సు కలిగిన ఈ వృషభం రాష్ట్రస్థాయి బలప్రదర్శన పోటీల్లో మొదటి, రెండవ స్థానాల్లో నిలుస్తూ వచ్చింది. ప్రకాశం జిల్లాలో ఇటీవల నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీల్లో 'అధిర ప్రతిభనును చూసి ముచ్చటపడిన శేషాద్రి చౌదరి ప్యాపిలి మండలం డి.రంగాపురం గ్రామానికి వచ్చాడు. ఎంత ధర అయినా సరే కొనుగోలు చేయాలని ఆయన నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో ఏకంగా రూ.14 లక్షలు వెచ్చించి 'అధిరను కొనుగోలు చేయడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

## బాధితులకు సత్వర న్యాయం : జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

నంద్యాల నూనెపల్లె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, అణగారిన వర్గాల ప్రజలపై దాడులు, అత్యాచారానికి గురైన బాధితులకు సత్వర న్యాయం, పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. జేసీతో పాటు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) యుగంధర్‌బాబు, ఏఎస్పీ మంద జావలి ఆల్ఫోన్స్, డీఆర్వో రామునాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ విష్ణుచ రణ్ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 18కేసులు నమో దయ్యాయని, కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు కేసుల వివరాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఖాళీల వివరాలు తెప్పించుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. నంద్యాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామణి, కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జొన్న రైతులను ఆదుకోండి

రాయలసీమ సాగునీటి సాధన సమితి

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జొన్నలను తక్షణమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు బొజ్జాదశరధరామిరెడ్డి మాట్లాడుతూ జొన్నలు బహిరంగ మార్కెట్‌లో ప్రభుత్వ మద్ధతు ధర కంటే తక్కువగా ఉన్నాయని, ప్రభుత్వం మూడు వారాల నుంచి కొనుగోలు చేస్తామని చెబుతున్నప్పటికీ నేటికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకుల విజ్ఞప్తికి జేసీ విష్ణుచరణ్ స్పందించారు. మద్దతు ధరకు జొన్న లను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వచ్చే వారం నుంచి జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతవరకు అకాల వర్షాల నుంచి జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరినా థరెడ్డి, మురళీనాథ్ రెడ్డి, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

## శ్రీశైలంలో భారీ బందోబస్తు

- నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

శ్రీశైలం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలకు భారీగా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆదేశాల మేరకు నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా శ్రీశైలంలో బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. గురువారం ఆయన పోలీసులతో ప్రత్యేకంగా సమావేశమై దిశానిర్దేశం చేశారు. శ్రీశైలంలో బందోబస్తుకు రాయలసీమ నాలుగు జిల్లాల నుంచి ఆరుగురు డీఎస్పీలు, 40 మంది సీఐలు, వంద మంది ఎస్ఐలు, 1500 మంది పోలీసులు, 200 మంది సాయుధ పోలీ సులు, 200 మంది ఏపీఎస్పీ పోలీసులు, 100 మంది స్పెషల్ పార్టీ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. సెక్యూరిటీలో భాగంగా బాంబు నిర్వీర్య బృందాల(బీడీ టీమ్స్)ను రప్పించారు. అదేవిధంగా క్యూలైన్ల వద్ద భక్తులను తనిఖీ చేసేందుకు డీఎఫ్ఎండీ, హెచ్‌హెచ్ఎండీలను ఏర్పాటు చేశారు.



పోలీసులకు దిశా నిర్దేశం చేస్తున్న ఎస్పీ

అలాగే ట్రాఫిక్ నియంత్రణకు 15 బ్లూ కోల్ట్స్, 10 రక్షక్ వాహనాలు, దొంగతనాల నివారణకు క్రైమ్ పోలీసులు, 800 సీసీ కెమెరాలు, 3 డ్రోన్లతో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో నంద్యాల ఏఆర్ ఏఎస్పీ చంద్రబాబు, ఆత్మకూరు డీఎస్పీ రామంజినాయక్, శ్రీశైలం సీఐ జి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ కోఆప్షన్ సభ్యుడిగా ఇలియాజ్

ఎన్నిక ఏకగ్రీవం

కర్నూలు న్యూసిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడిగా నంద్యాల జిల్లా వెలుగోడుకు చెందిన ఎం. ఇలియాజ్ ఖాన్ ఎన్నిక ఏకగ్రీవమైంది. గురువారం జిల్లా పరిషత్ పరిపాలన భవనంలో కలెక్టర్, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి పి.రంజిత్ బాషా సమక్షంలో ఎన్నిక ప్రక్రియ కొనసాగింది. వెలుగోడుకు చెందిన ఇలియాజ్‌ఖాన్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయగా ఆయన ఏకగ్రీవంగా ఎంపికైనట్లు కలెక్టర్ వెల్లడించారు. అనంతరం డిక్లరేషన్ ఫారం అందజేసి ప్రమాణస్వీకారం చేయించారు. గత సంవత్సరం వెలుగోడుకు చెందిన కో ఆప్షన్ సభ్యుడు సులేమాన్ మరణించడంతో ఎన్నికలు నిర్వహించారు. మెజార్టీ జడ్పీటీసీలు వైసీపీకి చెందిన వారు కావడం, మిగిలిన వారు ఎవరూ కూడా నామినేషన్ వేయకపోవడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, సీఈఓ జి.నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి, జడ్పీటీసీ సభ్యులు హాజరయ్యారు.

- తుగ్గలి ఎంపీపీగా రచ్చపాటి రామానుజమ్మ(వైసీపీ), వెల్దుర్తి ఎంపీపీగా డి.లక్ష్మీదేవమ్మ(వైసీపీ), క్రిష్ణగిరి కో ఆప్షన్ సభ్యుడిగా షేక్ చిన్నషాలు ఎన్నికయ్యారు. ఆయా మండల కేంద్రాల్లో జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి వెల్లడించారు.



కలెక్టర్‌కు నామినేషన్ పత్రం అందజేస్తున్న ఇలియాజ్ ఖాన్

## అరటి ధర పతనం

- సగానికి పైగా తగ్గుదల
- రెండు నెలల్లోనే ధరలు తారుమారు



చిన్నవంగలిలో సాగు చేసిన అరటి

చాగలమర్రి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అరటి టన్ను రెండు నెలల క్రితం రూ.20 వేలు నుంచి రూ.25 వేలు పలికింది. ప్రస్తుతం రూ.7 వేలు నుంచి రూ.10 వేలకు పడిపోయింది. సగానికి సగం ధరలు తగ్గిపో వడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ ప్రాంతంలో టన్ను రూ.55 వేలకు అరటి అమ్ముడవుతండగా స్థానికంగా మాత్రం రూ.10 వేలకు మించి ధర పలకడం లేదు. అయితే వ్యాపారులు సిండికేట్‌గా మారి అరటి ధర పతనానికి కారకులయ్యారా? అన్న అనుమానాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో సుమారు 10 వేల ఎకరా లకు పైగా అరటి సాగు చేస్తున్నారు. ఎకరాకు 1,200 మొక్కలు చొప్పున రూ.60 వేలు ఖర్చు చేసి నాటుతు న్నారు. సరాసరి 20 టన్నుల నుంచి 30 టన్నులు పైగా దిగుబడి వస్తుంది. ఎకరాకు రూ.1.30 లక్షలు దాక పెట్టుబడి పెడుతున్నారు. చాగలమర్రి మండలంలో 850 ఎకరాలు, ఆళ్లగడ్డలో 20 ఎకరాలు, శిరివెళ్ల 180 ఎక రాలు, రుద్రవరం 480, నంద్యాల 140, ఉయ్యాలవాడ 35, పాములపాడు 35, కొత్తపల్లి 15, పాణ్యం 274, డోన్ 580, బేతంచర్ల 280, గడివేముల 122, బండిఆత్మకూరు 220, మహా నంది 6,010, కొలిమిగుండ్ల 304, బనగానపల్లె 15 ఎకరాల్లో అరటి సాగు అవుతోంది. ప్రస్తుతం అరటి దిగుబడి బాగానే ఉన్నా ధరలు పతనం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దళా రులు, వ్యాపారులు కలిసి అరటి ధరను తగ్గిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అరటికి తగిన ధర వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

- **దళారులదే పైచేయి:** జిల్లాలోని ఆయా మండలాల్లో లోకల్ దళారుల హవా సాగుతోంది. దళారులు నేరుగా రైతుల వద్దకు వెళ్లి తక్కువ ధరకు కొనుగోలు చేస్తారు. అనంతరం ఆ పంటను దేశ, విదేశాలకు చెందిన సంస్థలకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. అలా పండ్ల తోటలను బట్టి టన్ను మీద రూ.3 వేలు నుంచి రూ.5 వేలు వరకు మిగిల్చు కుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్క డకు వచ్చే వ్యాపారులు సైతం దళారులను ఆశ్రయించాల్సిందే. వారు చెప్పిన ధరకే వ్యాపారులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొందరు లోకల్ దళా రులు నిర్ణయించిన ధరకే రైతులు విక్రయించుకో వాల్సి వస్తోంది. దీంతో పండించిన పంటకు గిట్టు బాటు లేకుండా నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి దళారి వ్యవస్థ లేకుండా ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

### దిగుబడి ఉన్నా ధర లేదు



4 ఎకరాల్లో అరటి సాగు చేశా. ఎకరాకు రూ.1.30 లక్షలు పెట్టుబడి పెట్టా. గత రెండు నెలల క్రితం టన్ను రూ.21 వేలు ప్రకారం అమ్ముకున్నా. ప్రస్తుతం టన్ను రూ.7 వేలు పలుకుతోంది. దిగుబడి ఉన్నా ధర లేక నష్టపోతున్నాం. ప్రభుత్వమే ఆదుకోవాలి.

**- చంద్ర ఓబుళరెడ్డి, రైతు, చిన్నవంగలి**

### దళారుల బెడద ఎక్కువైంది



రైతులకు లోకల్ దళారుల బెడద ఎక్కువైంది. 4.50 ఎకరాల్లో అరటి సాగు చేశా. టన్ను ధర రూ.7 వేలు నుంచి రూ.10 వేలు పలుకుతోంది. దళా రులు చెప్పిన రేటుకే అమ్మాల్సి వస్తోంది. నేరుగా ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసే రైతులు తక్కు వగా ఉండటం దళారులకు వరంగా మారింది. ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించి

**- అనిల్‌కుమార్‌రెడ్డి, రైతు, చిన్నవంగలి**



అరటి గెలలను లోడ్ చేస్తున్న కూలీలు

## డీఎస్సీ ఉచిత శిక్షణకు అభ్యర్థుల ఎంపిక

నంద్యాల నూనెపల్లె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సంబంధించి ఎంపికైన అభ్యర్థుల రెండో జాబితాను విడుదల చేసినట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైనఅభ్యర్థుల వివరాలను వెబ్‌పోర్టల్ ఉంచినట్లు తెలిపారు. షార్ట్‌లిస్ట్ చేయబడిన అభ్యర్థులంతా తమ వెబ్ ఆప్షన్లను జ్ఞానభూమి పోర్టల్, మరో వెబ్ పోర్టల్‌లో నమోదు చేయడానికి ఈ నెల 28 శుక్రవారం చివరితేదీ అన్నారు.

## రేపు నంద్యాలలో ఇఫ్తార్

హాజరు కానున్న కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం 6గంటలకు మున్సిపల్ టౌన్‌హాల్‌లో ఇఫ్తార్ ఏర్పాటు చేసినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సయిదా సబీహా పర్వీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ రాజకుమారి అధ్యక్షతన జరిగే ప్రభుత్వ ఇఫ్తార్‌విందుకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ముస్లిం మతపెద్దలు హాజరవుతున్నట్లు తెలిపారు. ముస్లింలు ఇఫ్తార్ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

## దీపం-2 అమలులో నాలుగో స్థానం

- ఈ-కేవైసీ పూర్తిగా ఉచితం
- ఎవరూ డబ్బు చెల్లించవద్దు
- జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజా రఘువీర్

**ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ**



కర్నూలు కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దీపం-2 పథకం అమలులో కర్నూలు జిల్లా నాలుగో స్థానంలో నిలిచిందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజా రఘువీర్ వెల్లడించారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రేషన్‌కార్డులోని సభ్యులకు ఈకేవైసీ చేయించాలంటే ఒక్కొక్కరికి రూ.50 చొప్పున కొందరు రేషన్‌డీలర్లు వసూలు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ-కేవైసీ పూర్తిగా ఉచితమని, అలా ఎవరైనా డబ్బు వసూలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ సమస్యలపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజా రఘువీర్‌తో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ.

**ప్రశ్న:** రేషన్‌కార్డులోని సభ్యులు ఈకేవైసీ చేసేందుకు రేషన్‌డీలర్లు ఒక్కొక్కరికీ రూ.50 వసూలు చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి?

**డీఎస్‌వో:** రేషన్ కార్డులోని సభ్యులు ఈకేవైసీ చేసేందుకు ఎలాంటి రుసుములు చెల్లించాల్సిన అవసరం లేదు. ఎవరైనా రుసుం చెల్లించాలని అడిగితే ఫిర్యాదు చేయాలి. కార్డుదారుల ఫిర్యాదు మేరకు ప్రభుత్వ నిబంధనలను అనుసరించి వారిపై చర్యలు తీసుకుంటాం.

**ప్రశ్న:** రేషన్‌కార్డు సభ్యుల ఈకేవైసీ చేయకపోతే కార్డు తొలగిస్తారని ప్రచారంలో ఉంది. ఇది వాస్తవమా..?

**డీఎస్‌వో:** గత వైసీపీ ప్రభుత్వంలో వలంటీర్లు హౌసింగ్ మ్యాపింగ్ చేశారు. హౌసింగ్ మ్యాపింగ్ చేసేటప్పుడు ఫ్యామిలీ సభ్యులను ఈకేవైసీ ద్వారా వేలిముద్రలు అప్‌డేట్ చేయించారు. కానీ రేషన్ కార్డులోని కొందరుసభ్యులు చనిపోవడం వల్ల, మరికొందరు ఆధార్ అప్‌డేట్ చేయకపోవడం వల్ల వేలిముద్రలు పడడం లేదు. కావున అలాంటి వారు ఖచ్చితంగా ఈకేవైసీ చేయించుకోవాలి.



**ప్రశ్న:** రేషన్‌కార్డులోని సభ్యులు ఎంత మంది ఈకేవైసీ చేయించారు. ఎంత మంది ఈకేవైసీ చేయలేదు అని తెలుసుకోవడం ఎలా?

**డీఎస్‌వో:** సమీప రేషన్ డీలర్ లేదా వీఆర్వో, సచివాలయ సిబ్బంది దగ్గరకు వెళ్లి మీ రేషన్‌కార్డు నెంబరు చెబితే ఎంత మంది ఈకేవైసీ పూర్తి చేశారు. ఎంత మంది ఈకేవైసీ పూర్తి చేయలేదో తెలుస్తుంది. కావున ఈకేవైసీ చేయని వారు మాత్రమే ఖచ్చితంగా ఈకేవైసీ చేయించుకోవాలి. ఎవరి రేషన్‌కార్డు తొలగించరు. రేషన్‌కార్డు సభ్యులందరికీ రేషన్ అందుతుంది.

**ప్రశ్న:** దీపం-2 పథకం అమలులో రాష్ట్రంలోని జిల్లా ఏ స్థానంలో ఉంది.

**డీఎస్‌వో:** దీపం-2లో భాగంగా తొలి ఉచిత సిలిండర్ కింద గ్యాస్ వినియోగదారులకు ప్రభుత్వం నుంచి జిల్లాకు రూ.31.37 కోట్లు సబ్సిడీ అందింది. రాష్ట్రంలో కర్నూలు జిల్లా నాలుగో స్థానంలో ఉంది.

**ప్రశ్న:** తొలి ఉచిత గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోని వారికి ఎప్పుడు లోపు చేసుకోవాలి.

**డీఎస్‌వో:** మార్చి 31లోపు గ్యాస్ వినియోగదారులు బుక్ చేసుకోవాలి.

**ప్రశ్న:** గ్యాస్ వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకున్న తర్వాత గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎన్ని రోజుల్లో డెలివరీ చేస్తారు?

**డీఎస్‌వో:** పట్టణ ప్రాంతాల్లో బుక్ చేసుకున్న వారికి 24 గంటల్లోపు, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లోపు గ్యాస్ డెలివరీ చేస్తారు. తర్వాత గ్యాస్ సిలిండర్ డెలివరి అయిన 48 గంటల్లోపు చెల్లించిన పూర్తి సొమ్మును లబ్ధిదారుల ఖాతాలో తిరిగి జమ చేయడం జరుగుతుంది.

**ప్రశ్న:** మిగతా రెండు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఎప్పుడు బుక్ చేసుకోవాలి?

**డీఎస్‌వో:** ఏప్రిల్, జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల మధ్య గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకోవాలి.

**ప్రశ్న:** ఉచిత గ్యాస్ సిలిండర్ పొందడానికి అర్హతలు?

**డీఎస్‌వో:** ఎల్‌పీజీ కనెక్షన్ కలిగి ఉండాలి. రైస్ కార్డు, ఆధార్ కార్డుతో రైస్‌కార్డు అనుసంధానమై ఉండాలి.

**ప్రశ్న:** రేషన్‌కార్డులోని సభ్యులు ఈకేవైసీ ఎప్పటిలోగా చేయాలి?

**డీఎస్‌వో:** మార్చి 31లోపు ఈకేవైసీ చేయాలి. రేషన్‌కార్డులోని ఐదు సంవత్సరాల పైన ఉన్నవారు, వేలిముద్రలు అప్‌డేట్ కానీ వారు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి.

**ప్రశ్న:** జిల్లాలో ఈకేవైసీ చేయించుకోని వారు ఎంత మంది ఉన్నారు?

**డీఎస్‌వో:** జిల్లాలో మొత్తం 21,92,047 మంది సభ్యులలో ఇంకా 2,78,177 మంది ఈకేవైసీ చేయించుకోవాలి.

## వ్యక్తి ఆత్మహత్య

బనగానపల్లె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందివర్గం గ్రామానికి చెందిన కోట దస్తగిరి (55) కడుపునొప్పి భరించలేక రసాయన పౌడర్‌ను నీటిలో కలుపుకొని తాగి ఆత్మహత్య చేసుకున్నారు. నందివర్గం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య గురువారం తెలిపిన వివరాలివీ.. దస్తగిరి కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నారు. దీంతో బాధను తాళలేక నందివర్గంలోని తన ఇంటి వద్ద రసాయన పౌడర్‌ను నీటిలో కలిపి తాగారు. వాంతులు చేసుకుంటుండగా ఆయన కోడలు రాజ్యలక్ష్మి చుట్టూ ప్రక్కల వారి సాయంతో నంద్యాల సమీపంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. దస్తగిరి కోడల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## న్యాయ పోరాటం చేస్తా

### ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న అఖిలప్రియ, టీడీపీ నాయకులు

కర్నూలు క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తనపై నిరాధార వార్తలు ప్రచురించిన వైఎస్ జగన్ అనుకూల మీడియాపై న్యాయపోరాటం చేస్తానని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పేర్కొన్నారు. తనపై ప్రతికూల వార్తలు రాశారని ఆరోపిస్తూ కర్నూలు నగర శివారులోని సాక్షి కార్యాలయం ఎదుట ఆమె తన అనుచరులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. ఓ లగేజీ వాహనంలో కోళ్ల వ్యర్థాలను సాక్షి కార్యాలయం ఎదుట తన అనుచరులతో వేయించి ఆమె నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు భార్గవ్ రామ్ పాల్గొన్నారు. అయితే డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ చంద్రబాబు నాయుడు, రామయ్యనాయుడు, మధుసూదన్ గౌడు, శేషయ్య, విజయలక్ష్మి, గౌతమి, ఎస్‌ఐలు అక్కడకు చేరుకుని ఎమ్మెల్యేతో పాటు నిరసనలో పాల్గొన్న టీడీపీ నాయకులను అడ్డుకున్నారు.

# ధార్మిక వస్త్రాలపై మక్కువ

**రంజాన్ ప్రత్యేకం**

- రంజాన్ మాసంలో మారిన వస్త్రాలంకరణ
- సంప్రదాయ దుస్తుల కొనుగోలుపై ప్రత్యేక ఆసక్తి



కర్నూలు కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో ముస్లింలు ధరించే వస్త్రాలకు ఎనలేని ప్రాధాన్యత ఉంటుంది. ఈ మాసంలో వారు రోజువారీ కార్యకలాపాలకు స్వస్తిచెప్పి ఆధ్యాత్మిక చింతనలో గడుపుతున్నారు. ఉపవాసం పాటిస్తూ, నిత్యం ఐదు పూటల నమాజులతోపాటు, రాత్రి ప్రత్యేక తరావీహ్ నమాజులతో ఖురాన్ పఠనం చేస్తున్నారు. ఆహార వ్యవహారాల్లోనే కాకుండా ఆహార్య (వస్త్రాలంకరణ) లోనూ ప్రత్యేక ఆసక్తి చూపిస్తుంటారు. ప్రత్యేకించి ముస్లిం యువకులు ఆధునిక దుస్తులకు స్వస్తి చెప్పి, సంప్రదాయ దుస్తులైన కుర్తా, పైజామాలను ధరిస్తున్నారు. యువత నెత్తిన టోపీ, తెల్లటి కుర్తా, పైజామా కొనుగోలుకు ఆసక్తి చూపిస్తారు. ఈద్-ఉల్-ఫిత్ర్ (రంజాన్) వేడుక రోజున ధరించేందుకు ఇప్పటి నుంచే యువత తాము కోరుకున్న సంప్రదాయ దుస్తులను కొనుగోలుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలోని పలు రెడీమేడ్ దుకాణాలు కూడా ఈ సంప్రదాయ వస్త్రాలను అమ్మకాలు చేస్తున్నాయి. తెలుపు రంగులో కానవచ్చే కుర్తాలు, పైజామాలు వివిధ డిజైన్లలోనూ రూపొందిస్తున్నారు. అలాగే ఈ మాసంలో ప్రత్యేకంగా లభించే ఆబాయా, షాయా, సదరియా వంటి వస్త్రాలను ధరిస్తూ అదనపు ఆకర్షణపై దృష్టి సారిస్తున్నారు.



**వస్త్రధారణ ప్రత్యేకం :** మహ్మద్ ప్రవక్త నిండైన తెల్లటి కుర్తా, పైజామా, తలపై టోపీ ధరించేవారని పెద్దలు చెబుతారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ నేటికీ ముస్లింలు ఈద్ రోజున సంప్రదాయ దుస్తులను ధరిస్తుంటారు. తెల్లటి కుర్తా, పైజామానే ధరించడానికి ఆసక్తి చూపిస్తారు. ఈ ఏడాది కూడా ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ రానున్న రంజాన్ పండుగ (ఈద్-ఉల్-ఫిత్ర్) సందర్భంగా ధరించేందుకు ప్రత్యేక సంప్రదాయ దుస్తులైన కుర్తా, పైజామాల కొనుగోలుకు సిద్ధమవుతున్నారు. దీంతో సంప్రదాయ వస్త్రాల కొనుగోళ్ల సందడి జిల్లాలో బాగా పెరిగింది.





**విభిన్న డిజైన్లు :** యువత అభిరుచులకు అనుగుణంగా వందకు పైగా విభిన్న డిజైన్లతో కూడిన కుర్తాలు, పైజామాలు మార్కెట్లో లభిస్తున్నాయి. అలాగే అన్ని వయసుల వారికి కూడా నచ్చే దుస్తులనే పండుగ సందర్భంగా వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. ఇక ధరల విషయంలో వస్త్రాల నాణ్యత, మన్నిక అనుసారంగానే అవి ధరలు పలుకుతున్నాయి. సాధారణ కాటన్‌తో రూపొందించిన సంప్రదాయ వస్త్రాలు రూ.450 నుంచి మొదలవుతాయి. ఆయా డిజైన్లు, మోడళ్ల అనుగుణంగా రూ.5 వేల వరకు అమ్మకాలు చేస్తున్నారు. వీటిలో సంప్ర దాయ దుస్తులకు అదనపు ఆకర్షణ ఇచ్చే ఆబాయా, షాయా, సదరియా వంటివి రూ.800 నుంచి రూ.6 వేల వరకు లభిస్తున్నాయి.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



ఈశ్వరయ్య (ఫైల్)

క్రిష్ణగిరి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెకుంట గ్రామ పొలిమేరలో కోడుమూరు మండలం గోరంట్ల గ్రామానికి చెందిన రైతు చెరుకుల పాటి ఈశ్వరయ్య (40) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల మేరకు.. ఉదయం పొలానికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి నుంచి బయలుదేరాడు. ఎంత సేపటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా మొక్కజొన్న చేనులో కానుగ చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. పంటల సాగుకు రూ. 10లక్షల మేరకు అప్పులు చేశాడు. ఈ ఏడాది అప్పు చేసి 7 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా ఎండు తెగులు వచ్చి పంట దెబ్బతింది. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఉరి వేసుకున్నాడు. మృతుడి తల్లి చెరుకుల పాటి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లికార్జున తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

## వైసీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

బనగానపల్లె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైప గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మోదుళ్ల ప్రతాప్‌రెడ్డి, మోదుళ్ల సుబ్బరామిరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు నందివర్గం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య గురువారం తెలిపారు. కైప గ్రామంలో కొత్తగా సీసీ రోడ్డు వేస్తున్నారు. అయితే ప్రతాప్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి ట్రాక్టర్‌పై వచ్చి సిమెంట్ రోడ్డును ట్రాక్టర్‌తో తొక్కించారు. ఎందుకు తొక్కిస్తున్నారని అక్కడే పనిచేస్తున్న ఓబులేసు వీరిని ప్రశ్నించగా కులం పేరుతో దూషించారు. ఓబులేసు ఫిర్యాదు మేరకు ప్రతాపరెడ్డి, సుబ్బరామిరరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## అనుమతులు తప్పనిసరి

### కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



అనుమతులు లేని లాడ్జీలను పరిశీలిస్తున్న కుడా చైర్మన్ సోమిశెట్టి

మంత్రాలయం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): లాడ్జిల నిర్వహణకు అనుమతులు ఉండాల్సిందేనని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. మంత్రాలయంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న లాడ్జీలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. గురువారం కుడా ప్లానింగ్ అధికారి విజయభాస్కర్, డీఈ గోపాలకృష్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజుతో కలిసి మంత్రాలయంలో రామచంద్రనగర్, పాత లాడ్జీల ఏరియా, నాగులదిన్నె రోడ్డులో అనుమతులు లేని లాడ్జిలను పరిశీలించారు. ఈ సందర్భంగా సోమిశెట్టి మాట్లాడుతూ ఇప్పటికే 47 మందికి నోటీసులు ఇచ్చామన్నారు. దరఖాస్తు చేసుకుంటే అనుమతులు ఇస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మంత్రాలయంలోనే అనుమతులు లేని లాడ్జిలు అధికంగా కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్‌ఐ శివాంజల్, టీడీపీ నాయకులు వరదరాజు, మేకల వెంకటేశ్, శివ, వార్డు ప్లానింగ్ అధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బైరెడ్డి సిద్దార్థరెడ్డి

నందికొట్కూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బైరెడ్డి సిద్దార్థరెడ్డిని నియమించారు. ప్రస్తుతం నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్తగా ధార సుధీర్ ఉండడంతో బైరెడ్డి సిద్దార్థరెడ్డికి రాష్ట్ర పదవిని కట్టబెట్టినట్లు సమాచారం.



## నంద్యాలలో హిజ్రాల ఘర్షణ

- పోలీసు స్టేషన్ల ఎదుటే రాళ్లు రువ్వుకున్న వైనం
- చెదరగొట్టిన పోలీసులు



రాళ్లు రువ్వుకుంటున్న హిజ్రాలు

నంద్యాల క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కేంద్రంలో గురువారం ఇరువర్గాలకు చెందిన హిజ్రాలు ఘర్షణకు పాల్పడ్డారు. పాణ్యానికి చెందిన ఓ వర్గం వారి పరిధిదాటి నంద్యాల ప్రాంతానికి భిక్షాటనకు రావడంతో స్థానికంగా ఉన్న హిజ్రాలు అడ్డుచెప్పడంతో ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. భిక్షాటన విషయంలో పాణ్యం, నంద్యాలకు చెందిన ఇరువర్గాల మధ్య కొంతకాలం నుంచి వివాదం రగులుతోంది. ఇరువర్గాలు టూ టౌన్ పోలీస్ స్టేషన్, నంద్యాల తాలుకా పోలీస్ స్టేషన్ల ఎదుట ప్రధాన రహదారిపై కారంపొడి చల్లుకొని బాహాబాహీకి దిగారు. ఇరువర్గాలు రాళ్లు విసురుకొని భయానక వాతావరణాన్ని సృష్టించారు. సమాచారం అందుకున్న టూ టౌన్, తాలుకా పోలీసులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లోకి 20మందిని, తాలుకా పోలీస్ స్టేషన్‌లోకి 15మందిని పంపి అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ ఇస్మాయిల్, తాలుకా ఎస్‌ఐ గంగయ్య యాదవ్ తెలిపారు. ఈ ఘటనపై ఇరువర్గాలపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలుస్తోంది.

## వైసీపీ పాలనలో ఉద్యోగుల అవస్థలు

- ప్రస్తుత ప్రభుత్వం బకాయిలు చెల్లించడం అభినందనీయం
- ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంగళ్‌రెడ్డి



మాట్లాడుతున్న వెంగళ్‌రెడ్డి

నందికొట్కూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుత ప్రభుత్వం బకాయిలను చెల్లించడం అభినందనీయమని ఏపీఎన్‌జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంగళ్‌రెడ్డి అన్నారు. గురువారం నందికొట్కూరు పట్టణంలోని ఎన్‌జీవోస్ హోంలో విలేకరులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు గత ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను కూటమి ప్రభుత్వం విడుదల చేసి ఉద్యోగుల పట్ల చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. సరెండర్ లీవ్‌లు, ఏపీజీఎల్‌ఐ ఉద్యోగులు, టీచర్లు, పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. కొందరు ప్రజా ప్రతినిధులు ఉద్యోగులు, అధికారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు వాటిని నియంత్రించాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒకటో తేదీన జీతాలు వస్తున్నాయని అన్నారు. ఏపీఎన్‌జీవోస్ కర్నూలు జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి కృష్ణుడు, జిల్లా సహాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కర్నూలు పట్టణ అధ్యక్షుడు కాశన్న, నందికొట్కూరు తాలుకా అధ్యక్షుడు రాముడు, కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు వరలక్ష్మి, ఉమెన్స్ అర్గనైజింగ్ సెక్రటరీ వెంకట్‌లత, జాయింట్ సెక్రటరీలు చంచన్న, మాదన్న తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

## నందీశ్వరుడికి అభిషేకం



అభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

**మహానంది, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** మహానంది క్షేత్రంలో గురువారం సాయంత్రం రాతి నందీశ్వరుడి ప్రదోషకాల పూజలు, అభిషేకాలను ఆలయ వేదపండితులు నిర్వహించారు. బహుళ త్రయోదశి మహా ప్రదోషం పురస్కరించుకొని ప్రధాన ఆలయంలోని నందీశ్వరుడికి విశేష పూజలు, వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హుండీల ఆదాయం లెక్కింపు

**మహానంది, మార్చి 27(ఆంధ్రజ్యోతి):** మహానందిలో గురువారం హుండీ లెక్కింపు నిర్వహించగా దేవస్థానానికి రూ.39.23 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని అభిషేక మంటపంలో భక్తులు ప్రధాన ఆలయాల్లోని హుండీల్లో 35 రోజుల పాటు వేసిన కానుకలను లెక్కించినట్లు తెలిపారు. నగదుతో పాటు 87 గ్రాముల బంగారం, వెండి 475 గ్రాములు వచ్చిందని చెప్పారు. ఈ లెక్కింపులో దేవదాయశాఖ నంద్యాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఆలయ ఏఈవో యర్ర మల్ల మధు, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సుబ్బారెడ్డి, నాగమల్లయ్య, సిబ్బంది, బాలాజీ సేవా ట్రస్ట్, తిరుమల బాలాజీ సేవా సమితి సభ్యులు, యూనియన్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

**పాణ్యం:** మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు గురువారం నిర్వహించారు. ఈ లెక్కింపులో రూ.15,37,050 నగదు, 3 గ్రాముల బంగారు, 475 గ్రాముల వెండి ఆదాయం చేకూరినట్లు ఆలయ ఈవో రామకృష్ణ తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 1 వ తేదీ నుంచి ఇప్పటి దాకా ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవో జనార్దన్, నందివర్గం ఏపీజీబీ సిబ్బంది, బేతంచెర్ల భజన కృష్ణయ్య భక్త సేవా బృందం, గ్రామ పెద్దలు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేశ్‌ను కలిసిన భూమా బ్రహ్మానంద రెడ్డి



లోకేశ్‌తో భూమా బ్రహ్మానందరెడ్డి

**నంద్యాల రూరల్ మార్చి 27(ఆంధ్రజ్యోతి):** నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి బుధవారం అమరావతిలో విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా నంద్యాల సమస్యల గురించి చర్చించి వాటిని పరిష్కరించాలని మంత్రిని కోరారు.

## సారా అనర్థాలపై ప్రజలకు అవగాహన

**నందికొట్కూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** సారా వల్ల కలిగే అనర్థాలపై కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సుభాషిణి పట్టణంలోని నీలిశికారి కాలనీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్సైజ్ చట్టం, ప్రొహిబిషన్ చట్టం, పీడీ చట్టం ఇలా వివిధ చట్టాల మీద నీలిశికారి కాలనీలో వాసులకు వివరించారు. నందికొట్కూరు ఎక్సైజ్ సబ్ ఇనిస్పెక్టర్ జఫ్రూల్లా, సిబ్బంది కృపవర కుమారి, శంకర్ నాయక్, శివన్న, మధుసూదన్‌రెడ్డి, రామాంజనేయులు, సంధ్యారాణి, విద్యా ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులతో కరస్పాండెంట్, ఉపాధ్యాయులు

**గడివేముల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి హైస్కూల్‌లో గురువారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. హైస్కూల్ కరస్పాండెంట్ రామేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అకడమిక్ విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ఏవో రాఘవేంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా శివయ్య



సంఘీభావం తెలియజేస్తున్న నాయకులు

**నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** ఉపాధ్యాయ సంఘాల సమఖ్య జిల్లా అధ్యక్షుడిగా ఏపీటీఎఫ్257 నాయకుడు శివయ్య, ప్రధాన కార్యదర్శిగా రూట నాయకులు అబ్దుల్ కలాంలతో పాటు ఇతర కార్యవర్గసభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, జిల్లా ఛైర్మన్ మాధవస్వామి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గసభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కో ఛైర్మన్‌లుగా కిశోర్(టీటీఎఫ్), లక్ష్మన్‌నాయక్ (ఎస్టీయూఎస్), డిప్యూటీ జనరల్ సెక్రటరీగా పీవీ ప్రసాద్(యూటీఎఫ్), నగిరి శ్రీనివాసులు(ఏపీటీఎఫ్1938), ట్రెజరర్‌గా అబ్దుల్ నజీర్(ఆప్ట) ఎన్నికయ్యారు. నాయకులు మాట్లాడుతూ విద్యావ్యవస్థను నాశనం చేసే జీవో నెంబరు 117ను రద్దు చేయాలని, ప్రైమరీ ఆదర్శ పాఠశాల పేరుతో సుదూర ప్రాంతాల్లోని పాఠశాలలను విలీనం చేయవద్దని కోరారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోవిందరెడ్డి



**ఆత్మకూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి):** ఆత్మకూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది కంచర్ల గోవిందరెడ్డితో పాటు మిగతా కార్యవర్గం గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్నిక అధికారి పుల్లారెడ్డి సమక్షంలో జరిగిన ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా కంచర్ల గోవిందరెడ్డితో పాటు ప్రధాన కార్యదర్శి శివశంకర్, ఉపాధ్యక్షులుగా మల్లికార్జునసింగ్, కోశాధికారిగా లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శిగా చింతలయ్య, మీడియా కార్యదర్శిగా సుదర్శన్‌శర్మ, లైబ్రేరియన్‌గా హుసేన్‌మియ్యా ఎన్నికయ్యారు. 2026 మార్చి 31వ తేది వరకు వీరు బాధ్యతల్లో కొనసాగనున్నారు. కాగా అధ్యక్షుడిగా ఎన్నికైన కంచర్ల గోవిందరెడ్డి 13వ సారి ఈ బాధ్యతలు చేపట్టం విశేషం. నూతన కమిటీ ఎంపిక పట్ల ప్రస్తుత బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల వెంకటేశ్వర్లు, న్యాయవాదులు గిరిరాజు, నూర్‌అహ్మద్, కేశవరెడ్డి, మహెబూబ్‌బాషా తదితరులు అభినందించారు.

## మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి : జేసీ



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

**నంద్యాల నూనెపల్లె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో మాదకద్రవ్యాల సమూల నియంత్రణపై అన్ని ప్రభుత్వ శాఖలు సహకరించి చర్యలు చేపట్టాలని జేసీ విష్ణుచరణ్ అధికారులకు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో మాదకద్రవ్యాల జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లోని విద్యార్థులకు మాదకద్రవ్యాలవల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని ఫ్యాక్టరీలలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు పనిచేస్తున్నారని గంజాయి, ఇతర మాదకద్రవ్యాలను ఫ్యాక్టరీల్లోకి అక్రమంగా తరలించకుండా చర్యలు చేపట్టాలన్నారు. మెడికల్ షాపుల్లో వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా నిద్ర మాత్రలు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని డ్రగ్ కంట్రోలర్‌ను ఆదేశించారు. జిల్లాలో 8జాతీయ రహదారులు అనుసంధానం కావడం వల్ల సందర్శకుల తాకిడి అధికంగా ఉంటుందని వీటిద్వారా సరఫరా అయ్యే రవాణాను అరికట్టాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు, డీఆర్వో రామునాయక్, జిల్లా ఎక్సైజ్ అధికారి రవికుమార్, నంద్యాల, ఆత్మకూరు ఆర్డీవోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నీటిలో ఈ-కోలి బ్యాక్టీరియా

- నంద్యాలలో గుర్తించిన అధికారులు
- మూడు వాటర్ ప్లాంట్ల సీజ్



వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

**నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల వాటర్ ప్లాంట్ల నిర్వాహణ తీరును బుధవారం నంద్యాల వాటర్ వర్క్స్ సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా పలు వాటర్ ప్లాంట్లను తీసి పరీక్షా కేంద్రాలకు పంపారు. వాటిలో మూడు ప్లాంట్ల నీటిలో ఈ కోలి బ్యాక్టీరియా ఆనవాళ్లు కనిపించటంతో వెంటనే సంబంధిత ప్లాంట్లను సీజ్ చేశారు. ఇటీవల ఆత్మకూరు నిలితొట్ల వీధిలో ఈ కొలి బ్యాక్టీరీయా ఉన్న వాటర్ ప్లాంట్ల నీరు పలువురు అస్వస్తతకు గురికావడంతో పాటు ముగ్గురు చనిపోయారు. ఈ నేపథ్యంలో నంద్యాల మున్సిపల్ పరిధిలో వాటర్ ప్లాంట్లలో ఈ కొలి బ్యాక్టీరియా నమూనాలు దొరకటం ఆందోళన కల్గిస్తోంది.

**3 ప్లాంట్లను సీజ్ చేశాం: డీఈఈ నాగభూషణ్ రెడ్డి**

నంద్యాలలో గుర్తించిన 89 మినరల్ వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. పలు మినరల్ వాటర్ ప్లాంట్లపై దాడులు నిర్వహించి నమూనాలు పరీక్షలు చేయించాం. స్థానిక ఎన్జీవో కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాల పరిసరాలలో ఉన్న హెచ్2ఓ వాటర్ ప్లాంట్‌తో పాటు సరస్వతి నగర్‌లోని వెలాసిటీ కళాశాల దగ్గర ఉన్న సాహిద్, సాజిద్ వాటర్ ప్లాంట్, సంజీవనగర్‌లోని రామాలయం వెనుక ఉన్న శ్రీరామ వాటర్ ప్లాంట్‌లో ఈ బ్యాక్టీరియాను గుర్తించాం. వెంటనే సదరు వాటర్ ప్లాంట్లను మూసి వేయమని ఉత్తర్వులు జారీ చేశాం.

**మున్సిపల్ వాటర్ ఆరోగ్యానికి మంచిది: కమిషనర్ నిరంజన్ రెడ్డి**

సరిగా శుద్ధి చేయని ఆరోగ్యానికి, జేబుకు చిల్లులు పెట్టే మినరల్ ప్లాంట్ల నీటికంటే రక్షిత మున్సిపల్ నీరు ఆరోగ్యానికి మంచిది. మినరల్ వాటర్ కంటే తక్కువ ధరలోనే పౌరులకు రక్షిత నీటిని మున్సిపల్ కొలలయిల ద్వార పంపిణీ చేస్తున్నారు.కొళాయి నీటితో ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు.

## ఘనంగా బడేరాత్

**పాణ్యం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** రంజాన్ మాసోత్సవాలలో భాగంగా గురువారం మండలంలో ముస్లింలు బడేరాత్‌ను ఘనంగా నిర్వహించుకున్నారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పేదలకు అన్నదానం ఏర్పాటు చేశారు. రోజా దీక్షాపరులకు పలు చోట్ల వేకువజామున అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆల్ నూరానీ మసీదు నిర్వాహకులు ఖాదర్‌బాషా తెలిపారు.

## పెసరవాయి ఉప సర్పంచ్‌గా వెంకటసుబ్బయ్య

**గడివేముల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పెసరవాయి గ్రామ ఉపసర్పంచ్‌గా వెంకటసుబ్బయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల ప్రత్యేక అధికారి మహీధర్‌రెడ్డి అధ్యక్షతన ఉపసర్పంచ్ ఎన్నికలు జరిగాయి. వార్డు మెంబర్లు 12 మంది ఉండగా వెంకటసుబ్బయ్య నామినేషన్‌ను తిరుమలమ్మ ప్రతిపాదించగా వార్డు మెంబర్ శ్రీకాంత్‌రెడ్డి బలపరిచారు. ఉప సర్పంచ్ పదవికి పోటీ ఎవరూ రాకపోవడంతో మంజుల వెంకటసుబ్బయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉప సర్పంచ్ ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## 1న పాల బండ్ల ఎద్దుల పోటీలు

**కొత్తపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** ఉగాది సందర్భంగా కొక్కెరంచ గ్రామంలో చెన్నకేశవ స్వామి ఆలయం ఆధ్వర్యంలో ఏప్రిల్ 1వ తేదీన అంతరాష్ట్ర స్థాయి పాల పండ్ల (2.2 పండ్లలోపు) ఎద్దుల పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు గురువారం తెలిపారు. 1వ తేదీ ఉదయం 7.30 గంటలలోపు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి వారి పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. మొదటి 8 బహుమతులు వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.7వేలు, రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9490406045, 7799234299 నెంబర్లను సంప్రదించాలన్నారు.

## పీఠాధిపతికి పూజలు

**పాములపాడు, మార్చి 27(ఆంధ్రజ్యోతి):** మండలంలోని జూటూరు గ్రామ శివార్లలోని కేజీ రోడ్డుపై శ్రీ నాగసాయి బ్రహ్మవిద్య ఆశ్రమంలో మహారాష్ట్రలోని సోలాపూరు పట్టణంలో గల సిద్ధరామేశ్వర పీఠాధిపతి, ఆకాష్ మహరాజ్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం శ్రీ నాగసాయి బ్రహ్మవిద్య ఆశ్రమం పీఠాధిపతి రామనందస్వామి మేళతాళలతో, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూలమాలలు వేసి ఆశ్రమ ఆచరాల ప్రకారం పీఠాదిపతికి గురుపూజ నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పాదయాత్రగా శ్రీశైలం వెళ్తూ ఆశ్రమంను సందర్శించారని పీఠాధిపతి చెప్పారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 'బీసీల అభ్యున్నతికి కృషి చేయాలి'

**పాములపాడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** బీసీల అభ్యున్నతికి కృషి చేయాలని బీసీ సంక్షేమసంఘం ప్రచార కార్యదర్శి వేంపెంట రాంబాబు కోరారు. గురువారం పాములపాడులో నందికొట్కూరు నియోజకవర్గం బీసీ సంక్షేమసంఘం ప్రచార కార్యదర్శిగా భోగినం నాగలింగమయ్యను ఎన్నుకున్నారు. జాతీయ బీసీ సంక్షేమసంఘం జిల్లా కన్వీనర్ ఆర్‌యస్ఆర్ గోపాల్, జాతీయ బీసీ సంక్షేమసంఘం మండల అధ్యక్షుడు మురళీమోహన్, రామ్మోహన్, సురేశ్ పాల్గొన్నారు.

## 'పెండింగ్ బిల్లులు చెల్లించాలి'

**మిడుతూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి):** ఉపాధి కూలీలకు ఆరు వారాల పెండింగ్ బిల్లులతో పాటు మౌలిక వసతులు కల్పించాలని పీపీ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండు చేశారు. సిపిఎంఎల్ లిబరేషన్ పార్టి గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం మిడుతూరు గ్రామంలో ఉపాధి పనులను పిరిశీలించారు. సుధాకర్, రమణ, నాగన్న, రాజు, అఖిల్, రాజేష్ ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## వృద్ధురాలికి ఎమ్మెల్యే నివాళి

**పాములపాడు, మార్చి 27(ఆంధ్రజ్యోతి):** పాములపాడులో టీడీపీ నాయకుడు గోవిందు తల్లి అచ్చమ్మ (76) మృతి చెంద డంతో గురువారం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు జనార్దన్‌రెడ్డి, కృష్ణ, మల్లికార్జున ఉన్నారు.

## ముస్లింలకు ఇఫ్తార్



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

**ఆత్మకూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి):** రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు పట్టణంలోని మక్కా మసీద్‌లో గురువారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్‌లో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు. ఆయన ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత ఉపవాస దీక్షలను విరమింపజేసి ముస్లింలకు ఇఫ్తారు ఇచ్చారు. ముస్లిం మతపెద్దలు ఎమ్మెల్యే బుడ్డాను ఘనంగా సత్కరించారు. ఆత్మకూరు అర్బన్ సీఐ రాము, ఎస్ఐ నారాయణరెడ్డి, నాయకులు వంగాల శివరామిరెడ్డి, యుగంధర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాషా, నూర్‌బేగ్, నాగూర్‌ఖాన్, పస్పీల్‌మున్నా, నబీరసూల్, న్యామత్, షాలుపైల్వాన్, రఫీక్, మన్సూర్ ఉన్నారు.

**కన్నడిగులతో ముచ్చటించిన శ్రీశైలం ఎమ్మెల్యే**

శ్రీశైలానికి వెళ్తున్న కొంత మంది కర్ణాటక భక్తులు తమ వాహనాలను ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయం వద్ద నిలిపి ఆ ప్రాంగణంలో వంటలు చేసుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి కార్యాలయం వద్ద కన్నడ భాషలోనే ముచ్చటించారు. అంతేకాకుండా శాలువాతో సత్కరించి ఆనందాన్ని పంచుకున్నారు.

## 'వ్యక్తిగత ఘర్షణలను పార్టీకి ఆపాదించడం తగదు'



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

**జూపాడుబంగ్లా, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** వ్యక్తిగత ఘర్షణలను టీడీపీకి ఆపాదించడం తగదని టీడీపీ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు యాదవ్, జిల్లా అధికారప్రతినిధి గిరీశ్వరరెడ్డి, శ్రీనివాసులు వైసీపీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం జూపాడుబంగ్లాలోని టీడీపీ కార్యాలయంలో మండల టీడీపీ నాయకులు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత రెండురోజుల క్రితం మండలంలో పొలం విషయంలో ఘర్షణ పడి ఇరువర్గాల దాడులు చేసుకుంటే టీడీపీ నాయకులు దాడిచేశారని వైసీపీ నాయకులు ఆరోపించడం తగదని అన్నారు. నాయకులు మోహన్‌రెడ్డి, రమణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, పెద్దన్న, నారాయణరెడ్డి, రవికాంత్, రవికుమార్‌యాదవ్, బాలమద్దిలేటి, రాముడు, రామ్మోహన్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నాగిరెడ్డి, శివరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 'సేంద్రియ పద్ధతిలో పుట్టగొడుగుల పెంపకం అభినందనీయం'

**నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** సేంద్రియ పద్ధతులతో పుట్టగొడుగులను పెంచడం అభినందనీయమని, పుట్టగొడుగులు ప్రకృతి ఇచ్చిన ప్రసాదమని శ్రీ రామకృష్ణా విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి అన్నారు. శ్రీ రామకృష్ణా డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్రం అధ్యాపకులు మురళీధర్, అంద్రూస్‌ల ఆధ్వర్యంలో పుట్టగొడుగులపై విద్యార్థులకు 45 రోజుల శిక్షణ పూర్తిచేసుకున్న సందర్భంగా విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ ఈ పెంపకం శిక్షణ ద్వారా విద్యార్థులకు స్వయం ఉపాధి వైపు మళ్లించడానికి ఇది ఒక గొప్ప అవకాశమని అన్నారు. ప్రిన్సిపాల్ కేబీవీ సుబ్బయ్య, డీన్ ఆఫ్ అకడమిక్స్ ప్రగతిరెడ్డి పాల్గొన్నారు.

## రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న జేసీ విష్ణుచరణ్

**నంద్యాల ఎడ్యుకేషన్/నూనెపల్లె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్‌ఇమ్రాన్‌పాషా, గౌరవాధ్యక్షుడు అబులైస్ ఆధ్వర్యంలో వారి అసోసియేషన్ సభ్యుల సహకారంతో రంజాన్ తోఫా కిట్‌లను జేసీ విష్ణుచరణ్ చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. ప్రభుత్వంలోని వివిధ శాఖలకు చెందిన మైనార్టీ ఉద్యోగులందరూ కలిసి ఆల్‌మేవాగా ఏర్పడి సేవలందించడం అభినందనీయమని జేసీ అన్నారు. తోఫా కిట్స్‌ను తయారు చేయడానికి క్లౌడ్ ఫండింగ్ ద్వారా రూ.2,27,200 సేకరించి 421 రంజాన్ కిట్‌లను తయారు చేసి నట్లు తెలిపారు. ఆల్‌మేవా నాయకులు మునీర్‌అహ్మద్, జాఫర్ పాల్గొన్నారు.



అందజేస్తున్న బుగ్గ రాముడు

**నంద్యాల మున్సిపాలిటీ:** పట్టణ శివారు కాలనీ వైఎస్ నగర్‌లో టీడీపీ 38వ వార్డు ఇన్‌చార్జి తాటికొండ బుగ్గ రాముడు బుధవారం తన స్వగృహంలో రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఇటీవల మరణించిన మంత్రి ఫరూక్ సతీమణి షెహనాజ్ స్మృత్యర్థం నిర్వహించారు. పలువురు పేద ముస్లిం వితంతువులు చీరెలు తదితర వస్తువులతో కూడిన తోఫాను అందించారు. కార్యక్రమంలో ఎన్ఎండీ ఫయాజ్, కౌన్సిలర్ శ్యాంసుందర్‌లాల్, గోవింద నాయుడు, నందం బాబురావు ఇమాం హుసేన్, ఖాజా తదీతరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులకు ఉగాది కానుక అందజేత



ఉగాది కానుకను అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

**నంద్యాల కల్చరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి):** నంద్యాలలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం భవనాశి వెంకటసుబ్బయ్య శెట్టి, వెంకమ్మ చారిటీస్ ట్రస్ట్, దాతల సహకారంతో 400మంది పేద ఆర్యవైశ్య కుటుంబాలకు ఉగాది కానుకను(బియ్యం, పంచదార, నూనెపాకెట్, చింతపండు, సేమియా, బెల్లం, శనగ బేడలు తదితర వస్తువులు) పంపిణీ చేశారు. నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి నాగమహేష్, వాసవీ కాశీ అన్నదానసత్ర సముదాయాల వసతి గృహాల అధ్యక్షుడు భవనాశి శ్రీనివాస, ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళామండలి సభ్యులు చేతులమీదుగా పేద ఆర్యవైశ్యులకు ఉగాది కిట్లను పంపిణీచేశారు.

## విద్యార్థిని కారులో ఎత్తుకెళ్లారు..!

- నంద్యాలలో కలకలం రేపిన ఘటన
- కర్నూలు పోలీసులు తీసుకెళ్లినట్లు నిర్ధారణ

**నంద్యాల క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల జిల్లా కేంద్రంలో గురువారం ఓ విద్యార్థిని కారులో ఎత్తుకెళ్లడం కలకలం రేపింది. కిడ్నాప్ చేసినవారు పోలీసులా లేక గుర్తుతెలియని వ్యక్తులా అన్న సస్పెన్స్ చాలాసేపు కొనసాగింది. వివరాలివీ.. కర్నూలు జిల్లా నాగలాపురానికి చెందిన ఉమేష్‌చంద్ర నంద్యాల పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్నాడు. కళాశాలకు సమీపంలో ఉన్న దేవనగర్ బీసీ హాస్టల్‌లో ఆశ్రయం పొందుతున్నాడు. మధ్యాహ్నం హాస్టల్ నుంచి బయటకు వచ్చిన ఉమేష్‌చంద్ర వద్దకు కొందరు వ్యక్తులు కారులో వచ్చి తాము పోలీసులం అని చెప్పి బలవంతంగా ఎక్కించుకొని వెళ్లడంతో పక్కనే ఉన్న స్నేహితుడు విషయాన్ని హాస్టల్ వార్డెన్‌కు తెలిపాడు. దీంతో వార్డెన్ జరిగిన విషయాన్ని జిల్లా అధికారిణి లక్ష్మీదేవి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె నంద్యాల టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని జరిగిన ఉదంతంపై ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా కారు నెంబర్‌ను గుర్తించి సదరు నెంబర్‌కు అనుసంధానమైన వాహన యజమానికి ఫోన్ చేయడంతో పాటు ఇతర మార్గాల్లో వివరాలు రాబట్టేందుకు ప్రయత్నించారు. అయితే విద్యార్థిని కిడ్నాప్ చేసింది కర్నూలు పోలీసులని నిర్ధారణకు వచ్చి ఎందుకు అలా చేయాల్సి వచ్చిందని వాకబు చేయడంతో కర్నూలు తాలుకా పోలీస్ స్టేషన్‌లో విద్యార్థి ఉమేష్‌చంద్ర ప్రేమ వ్యవహారంపై ఫిర్యాదు అందడంతో అక్కడి పోలీసులు విద్యార్థిని కారులో ఎక్కించుకొని వెళ్లినట్లు తేలిందని అధికారిణి లక్ష్మీదేవి తెలిపారు. అయితే కర్నూలు పోలీసుల అత్యుత్సాహం కారణంగా అటు విద్యార్థి తల్లిదండ్రులు, స్నేహితులు, ఇటు హాస్టల్ వార్డెన్, ఉన్నతాధికారులతోపాటు నంద్యాల పోలీసులు కూడా ఉత్కంఠకు లోనయ్యారు.

## శ్రీశైలంలో జూదరుల అరెస్టు

**శ్రీశైలం, మార్చి 27(ఆంధ్రజ్యోతి):** శ్రీశైలంలో గురువారం సాయంత్రం పేక ఆడుతున్న ఐగురురిని సీఐ జి.ప్రసాదరావు అరెస్టు చేశారు. వివరాలివీ.. శ్రీశైలంలోని సిద్ధరామప్ప వాణిజ్య సముదాయం పైన కర్నూలు జిల్లా కౌతాళం మండలం వల్లూరు గ్రామానికి చెందిన ఐదుగురిని అరెస్టు చేశారు. డ్రోన్ కెమెరా ద్వారా శ్రీశైలం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ జి. ప్రసాదరావు, సిబ్బంది రఘునాథుడు, మహేష్, శివమహేంద్రారెడ్డి, నానునాయక్, బాలకృష్ణ, వెంకటనారాయణతో వెళ్లి పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 17,630 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## వ్యక్తిపై దాడి.. ఆరుగురిపై కేసు నమోదు

**మహానంది, మార్చి 27(ఆంధ్రజ్యోతి):** మండలంలోని గోపవరంలో బుధవారం రాత్రి గ్రామానికి చెందిన కంబగాని మద్దిలేటిపై అదే గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు దాడి చేసి గాయపర్చడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. మద్దిలేటితో పాటు భార్య దేవమ్మ, కుమారుడు మనోజ్‌కుమార్ గోప వరం మెట్టపై ఉండగా అదే గ్రామానికి చెందిన ముత్తా ఈశ్వరయ్య, మదన్, సురేష్, రమేష్, హరి, బాలచంద్రుడు పాత కక్షలతో దాడి చేశారు. ఈ దాడిలో తాను తీవ్రంగా గాయపడ్డాడని మద్దిలేటి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

## బెల్టు షాప్‌లపై దాడులు

**నంద్యాల క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** బెల్టు షాప్‌లపై గురువారం దాడులు చేసినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి రవికుమార్ గురువారం తెలిపారు. నంద్యాల ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహానంది మండలం గోపవరంలో బెల్టుషాప్‌లు నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్ట్‌చేసి 13క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. పాణ్యం మండలంలో నవోదయం కార్యక్రమంలో భాగంగా 23 మంది పాతముద్దాయిలను పాణ్యం తహసీల్దార్ ముందు బైండోవర్ చేశామన్నారు. నంద్యాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 4 ఏ4 షాపులలో మద్యం శాంపిళ్లను తీసుకున్నామని తెలిపారు.


## పాత సామగ్రి దుకాణంలో అగ్ని ప్రమాదం

**ఆత్మకూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని ఓ పాత సామగ్రి దుకాణంలో గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. వెలుగోడుకు చెందిన ఇస్మాయిల్ ఆత్మకూరు పట్టణ శివార్లలోని శ్రీశైలం రస్తాలో పాత సామగ్రి దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కేజీరోడ్డు బైపాస్ పక్కనపడి ఉన్న చెత్తాచెదారానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పటించారు. ఈ మంటలు కాస్త పాత సామాను దుకాణానికి వ్యాపించి ఒక్కసారిగా మంటలు చెలగిరి భారీ పొగ కమ్ముకుంది. అగ్నిమాపక కేంద్రం సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే 60శాతానికి పైగా పాత సామగ్రి దగ్ధమైంది. రూ.4లక్షల వరకు నష్టం వాటిల్లునట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మకూరు అర్బన్ సీఐ రాము ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

## 'పాస్టర్ మృతిపై విచారణ చేయాలి'

**ఆత్మకూరు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** రాజమండ్రిలో పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై విచారణ చేయాలని ఆల్ డినామినేషన్ పాస్టర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో తమ నిరసనన వ్యక్తం చేశారు. సభ్యుడు శేషు మాట్లాడుతూ ఆయన ప్రమాదవశాత్తు మరణించారా? హత్య చేశారా? విచారించాలని కోరారు. సభ్యులు పాస్టర్ త్యాగరాజు, పేతూరు, రమేష్, ఫిలమోను, జయరాజు,సుధాకర్ ఆనంద్, ధన్‌పాల్, అశోక్, అనిల్, క్రిష్టఫర్, పుల్లయ్య, శివ,రమణ, దివాకర్ పాల్గొన్నారు.

## 'గురురాజా' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి

**నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** హైదరాబాద్ యూనిఫైడ్ కౌన్సిల్ నిర్వహించిన జాతీయస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో గురురాజా పాఠశాల విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆరోతరగతి విభాగంలో సరయు, దేవేంద్ర, అక్షయ్‌జైన్, చార్విత, 7వ రతగతి విభాగంలో ముక్తేశ్వర్‌రెడ్డి, అమృత, ఐశ్వర్య, 8వ తరగతి విభాగంలో సాయిశ్రీ, అంకిత, లక్ష్మీసౌజన్య, 9వ తరగతి విభాగంలో దీక్షారెడ్డి, పల్లవి, దీక్షితలు ర్యాంకులు సాధించారని చెప్పారు. జాతీయ స్థాయిలో రెండు లక్షల మంది విద్యార్థుల్లో టెస్ట్‌లో పాల్గొనగా తమ పాఠశాలకు చెందిన 13మంది విద్యార్థులు ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందన్నారు.

## నీటి తొట్ల కోసం ఆందోళన


ఊటకొండలో ఆందోళన చేస్తున్న రైతులు

**ప్యాపిలి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** పశువులకు నీటి తొట్లు ఏర్పాటు చేయాలని గురువారం మండలంలోని ఊటకొండ గ్రామంలో రైతులు ఆందోళన చేశారు. గ్రామంలో దాదాపు 300 పైగా పశువులు ఉన్నాయన్నారు. చెరువులో, కుంటల్లో నీరు లేక పశువులు విలవిలలాడుతున్నాయన్నారు. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచక రైతులు ఆందోళనకు గురవుతున్నామని రైతులు తెలిపారు. ప్రభుత్వం గ్రామంలో నీటి తొట్లను ఏర్పాటు చేసి పశుల దాహం తీర్చాలని వారు కోరుతున్నారు. కార్యక్రమంలో రైతులు రామదాసు, రామచంద్రుడు, శ్రీరాములు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

**దొర్నిపాడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతులు పండించిన చిరు ధాన్యాలను వారి వద్ద నుంచి నేరుగా కొనుగోలు చేయడం జరుగుతుందని ఏవో ప్రమీల తెలిపారు. ఆమె మాట్లాడుతూ రైతుల నుంచి కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. కందులు క్వింటా రూ.7,550, శనగలు రూ.5,650, పెసలు రూ.8,682, మినుములు రూ.7,400 కొనుగోలు చేయడానికి దగ్గరలో ఉన్న మార్క్‌ఫెడ్ కేంద్రాల్లో సంప్రదించాలని అన్నారు. ధాన్యం అమ్ముకోదలచిన రైతులు రైతు సేవా కేంద్రాలలో వీఏఏను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రక్షణ గోడ నిర్మాణ పనులు నిలిపివేత

## సామగ్రిని సీజ్ చేసిన అటవీశాఖ అధికారులు

**శిరివెళ్ల, మార్చి 27(ఆంధ్రజ్యోతి) :** నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలోని సర్వలక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద జరుగుతున్న రక్షణ గోడ నిర్మాణ పనులను అటవీశాఖ అధికారులు నిలుపుదల చేశారు. 2018లో కురిసిన వర్షాలకు ఆలయ ముందు భాగంలోని రాతి కట్టడం, ధ్వజస్తంభం కూలిపోయాయి. అనంతరం 2022లో టీటీడీ నిధులతో ఆలయం వద్ద అభివృద్ధి పనులు చేపట్టారు. ఆలయ ముందు భాగంలో నిర్మిస్తున్న రక్షణ గోడ నాణ్యత లేకపోవడంతో గత ఏడాది కూలిపోయింది. ఆ తర్వాత అటవీశాఖ ఉన్నతాధికారుల అనుమతులు లేకుండా పనులు చేపట్టడంతో పనులు నిలుపుదల చేసి అక్కడ ఉన్న నిర్మాణ సామాగ్రిని గాజులపల్లెలోని ప్రభుత్వ టింబర్ డిపోకు తరలించినట్లు కోటకొండ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కిషోర్ గురువారం వెల్లడించారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

**చాగలమర్రి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం చాగలమర్రి పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అసాంఘీక కార్యకలాపాలకు స్వస్తి పలకాలని అన్నారు. కళాశాలలు, పాఠశాలల వద్ద ఈవిటీజింగ్ చేస్తే చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నబీసాహేబ్ ఉన్నారు.

## చాగలమర్రి ఎస్ఐగా సురేష్ నాయుడు



**చాగలమర్రి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో నూతన ఎస్ఐగా సురేష్‌నాయుడు గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. నంద్యాల డీసీఆర్బీ నుంచి చాగలమర్రికి బదిలీపై వచ్చారు. చాగలమర్రిలో పని చేస్తున్న ఎస్ఐ రమేష్‌రెడ్డి మూడు నెలల క్రితం చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. 90 రోజుల నుంచి ఎస్ఐ లేక ఇన్‌చార్జి ఎస్ఐ పాలనలో కొనసాగింది. ఎట్టకేలకు జిల్లా ఎస్పీ స్పందించి చాగలమర్రికి ఎస్‌గా సురేష్‌నాయుడును నియమించారు.

## మత్తుతో జీవితాలు చిత్తు

**శిరివెళ్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) :** యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను చిత్తు చేసుకోవద్దని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రావతి అన్నారు. పొగాకు, మద్యం, డ్రగ్స్ తదితర వాటివల్ల కలిగే నష్టాలపై ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు అధ్యక్షతను కళాశాలలో గురువారం సమావేశం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో మత్తు పదార్థాల వినియోగం నిషేధమని అధ్యాపకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు జనార్ధనుడు, సంజయ్, అధ్యాపకేతర సిబ్బంది శివ ప్రసాద్, గురు రమేష్ పాల్గొన్నారు.

## యువతకు పారిశ్రామిక అవకాశాలు కల్పించాలి

**కోవెలకుంట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) :** నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని బనగానపల్లె నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు హోటల్ శ్రీనిధి మద్దిలేటి కోరారు. ఇటీవల మంత్రి బీసీ జనార్దనరెడ్డిని బనగానపల్లెలో కలిసి నియోజకవర్గంలో నిరుద్యోగ యువతీ యువకులు అధిక సంఖ్యలో ఉన్నారని, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చిన్నపాటి పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మద్దిలేటి తెలిపారు.

## క్షయ నిర్మూలనకు కృషి


వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్లు

**కొలిమిగుండ్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ ఆదేశాల మేరకు క్షయ నిర్మూలన కోసం తమ వంతు కృషి చేస్తున్నట్లు రామ్‌కో సిమెంట్ పరిశ్రమ యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు పేర్కొన్నారు. గురువారం కొలిమిగుండ్లలో రామ్‌కో ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 95మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామ్‌కో ప్రెసిడెంట్ అడ్మిన్ రామరాజు, మైన్స్ జీఎం అబ్జల్ అహ్మద్, వైద్య బృందం పాల్గొన్నారు.

## డీఎస్సీ ఫ్రీ కోచింగ్ అభ్యర్థుల రెండో జాబితా విడుదల

**బనగానపల్లె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) :** ఇటీవల డీఎస్సీ కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సంబంధించి ఎంపికైన అభ్యర్థుల రెండవ జాబితా విడుదలైందని బనగానపల్లె సహాయ సాంఘిక సంక్షేమ అధికారి రాముడు గురువారం తెలిపారు. కోచింగ్‌కు ఎంపికైన అభ్యర్థులు ఉచిత డీఎస్సీ శిక్షణ కోసం ఎంపికైన అభ్యర్థుల వివరాలు వెబ్‌పోర్టర్, హెచ్‌టీటీపీఎస్.// ఎండీఎఫ్‌సీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఉచిత డీఎస్సీ కోసం శిక్షణ సంస్థలను అభ్యర్థులు తమ లాగిన్‌లో ఎంపిక చేసుకోవాలని ఆయన కోరారు.

## 30, 31 తేదీల్లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సేవలు

**అవుకు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) :** ఈనెల 30, 31 తేదీల్లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని అవుకు సబ్‌రిజిస్ట్రార్ రాముడు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం మార్చి నెల 30వతేదీన ఉగాది, 31వతేదీన రంజాన్ సెలవు రోజులు అయినప్పటికీ ప్రభుత్వం ఆదేశాల మేరకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్‌లకు ఎలాంటి ఆటంకాలు ఉండవని అన్నారు.

**బనగానపల్లె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) :** పొలాల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు సాంకేతిక కారణాలతో కాలిపోతున్నాయి. అయితే వాటికి మరమ్మతులు చేసే వారు కరువయ్యారు. బనగానపల్లె నియోజకర్గంలోని బనగానపల్లె, అవుకు, సంజామల, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల మండలాలకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే బనగానపల్లెలో మరమ్మతులు చేస్తారు. బనగానపల్లెలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల షెడ్ ఎత్తివేయడం, విద్యుత్ కాంట్రాక్టర్ మారడంతో రైతులు, పరిశ్రమ యజమానులు, ప్రజల శాపంగా మారింది. గత ఆరు నెలల నుంచి కాలిపోయిన ట్రాన్సఫార్మర్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో బోర్లుబావుల కింద సాగు చేసిన పంటలన్నీ ఎండుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులను అడిగితే నంద్యాలకు, డోన్‌కు వెళ్లాలని ఉచిత సలహాలు ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఎండలు అధికం కావడంతో ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు లేవు!

- ఆరు నెలలుగా మరమ్మతులు నిల్
- డోన్, నంద్యాలకు తీసుకు వెళ్లాలని విద్యుత్ అధికారుల సలహా
- ఇబ్బందులు పడుతున్న రైతులు


బనగానపల్లె విద్యుత్ కార్యాలయం ఆవరణలో మరమ్మతులకు నోచుకోని ట్రాన్స్‌ఫార్మర్లు

### 12వేలకు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు

బనగానపల్లె నియోజకవర్గంలో 12వేలకు పైగా ట్రాన్సఫార్మర్లు ఉన్నాయి. బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, గృహాలకు సంబంధించి ట్రాన్సుఫార్మర్లు కాలిపోతే బనగానపల్లెలో మరమ్మతులు చేయించుకునేవారు. అయితే పాత కాంట్రాక్టరు గడవు ముగిచడంతో షెడ్‌ను మూత వేశారు. కొత్త కాంట్రాక్టర్ రావవడానికి ముందుకొచ్చిన షెడ్‌కు అధికారులు అనమతులు ఇవ్వలేదు.

### మరమ్మతుల కోసం నంద్యాల, డోన్‌కు వెళ్లాల్సిందే

బనగానపల్లె పట్టణంలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం లేకపోవడంతో కొలిమిగుండ్ల, అవుకు, మండల ప్రజలు 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న డోన్‌కుగాని, 90 కిలోమీటర్ల దూరంలోని నంద్యాలకు వెళ్లాల్సి వస్తోంది. అదే బనగానపల్లె మండలంలో ట్రాన్సు ఫార్మర్లు కాలిపోతే 70 కిలోమీటర్ల దూరంలో డోన్‌లో ఉన్న మరమ్మతు కేంద్రానికి లేదా నంద్యాలలోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రానికి వెళ్లాలి. అంత దూరం ట్రాన్సుఫార్మర్లను తీసుకు వెళ్లలేక నిత్యం ప్రజలు, వ్యవసాయ రైతన్నలు, పరిశ్రమల యజమానులు ఇబ్బందులు పడుతున్నారు.

### ఎండుతున్న పంటలు

రబీలో రైతులు వివిధ రకాల పంటలు వేశారు. మొక్కజొన్న, వరి, అరటి, తదితర పంటలు సాగు చేశారు. విద్యుత్ ట్రాన్సుఫార్మర్ కాలిపోతే పంటలకు నీరు అందక ఎండుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పరిశ్రమల యజమానులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. బనగానపల్లెలో మరమ్మతు కేంద్రం ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని రైతులు, ప్రజలు పారిశ్రామికవేత్తలు కోరుతున్నారు.

### 6 నెలల నుంచి మరమ్మతులు లేవు..



బనగానపల్లెలో గత ఆరు నెలలుగా ట్రాన్సుఫార్మర్ మరమ్మతు కేంద్రం లేదు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే డోన్‌కు, నంద్యాలకు వెళ్లాల్సి వస్తోంది. 90 కిలోమీటర్ల దూరం వెళ్లాలంటే ఖర్చులు పెరుగుతున్నాయి. అక్కడికి పోయిన తర్వాత రెండుమూడు రోజుల తర్వాత మరమ్మతులు చేస్తుండడంతో ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి బనగనాపల్లెలోనే మరమ్మతుల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

**- కంబగిరి రాముడు, రైతు, మధునాంతపురం, కొలిమిగుండ్ల మండలం**

### విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కేంద్రానికి అనుమతి ఇవ్వాలి



బనగానపల్లె పట్టణంలో విద్యుత్ ట్రాన్సుఫార్మర్ మరమ్మతుల కేంద్రానికి అనుమతులు ఇవ్వాలి. డోన్, నంద్యాలకు విద్యుత్ ట్రాన్సుఫార్మర్లను తీసుకవెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. గతంలో బనగానపల్లెలో ట్రాన్సుఫార్మర్ మరమ్మతుల కేంద్రానికి అనుమతి ఉండేది.కాంట్రాక్టర్ గడవు ముగియడంతో కేంద్రాన్ని మూతవేశారు.

**- తులసిరెడ్డి, మిట్టపల్లె సర్పంచ్, బనగానపల్లె**



## పట్టణాభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే కోట్ల


ఆటోనగర్‌లో సీసీరోడ్ల పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

**డోన్ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** పట్టణాభివృద్ధే ప్రధాన లక్ష్యమని పట్టణంలో మౌలిక వసతులు కల్పించి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఆటోనగర్‌లో రూ.23 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అలాగే శ్రీనివాసనగర్‌లో రూ.6.4 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ కాల్వ నిర్మాణం పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ పరిశుభ్రంగా పట్టణం కోసం తీర్చిదిద్దడం కోసం సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువల ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పారిశుధ్యం మెరుగు పడి ప్రజల ఆరోగ్య జీవనప్రమాణాలు మెరుగు పడాలని ఆకాంక్షించారు.

● **డోన్‌లో నగరవనం ప్రారంభించిన ఎమ్మెల్యే కోట్ల:** డోన్ పట్టణంలోని గుత్తిరోడ్డులోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సమీపంలో ఏర్పాటు చేసిన నగరవనాన్ని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాస్ రెడ్డి ప్రారంభించారు. నగర వనంలో మొక్కలు నాటి ద్రోణాచలం నగరంగా నామకరణం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ నగర వనాన్ని సుందరంగా అభివృద్ధి పరచడానికి పూర్తి చర్యలు తీసుకుంటామన్నారు. నగర వనంలో వాకింగ్ ట్రాక్, స్కిల్ ట్రేకింగ్ మార్గం, మినీ జూ పార్క్, యోగా సెంటర్, జింకల పార్కు, జిమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో నాగమహేశ్వరి, సబ్ డీఎఫ్‌వో సూర్య చంద్రరాజు, డోన్ ఫారెస్టు రేంజర్ ప్రవీణ్ కుమార్, పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వలసల రామకృష్ణ, కోట్రికే ఫణిరాజ్, ఓబులాపురం శేషిరెడ్డి, మాజీ ఎంపీపీ శేషఫణి గౌడు, మాజీ సర్పంచ్ పెద్దకేశవయ్యగౌడు వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్ పాల్గొన్నారు.

## వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

**బేతంచెర్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని మండ్లవానిపల్లె గ్రామానికి చెందిన మండల బాలన్న అనే వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారని హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య కేసు నమోదైనట్లు గురువారం తెలిపారు. మండ్లవానిపల్లె గ్రామానికి చెందిన బాలన్న విద్యుత్ హెల్పర్‌గా పని చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడని, అదే గ్రామానికి చెందిన గాజా గోపాల్ గాజా జనార్దన్ తమ వీధిలో బల్బు వేయలేదని బాలన్నపై దాడి చేసి గాయపరిచారని తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కరాటేతోనే ఆత్మరక్షణ : బీసీ రాజారెడ్డి


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న బీసీ రాజారెడ్డి

**బనగానపల్లె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) :** కరాటేతోనే ఆత్మరక్షణ సాధ్యమవుతుందని, విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా అవసరమని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. గురువారం బనగానపల్లె పట్టణంలోని నెహ్రూ ఉన్నతపాఠశాలలో జెన్ షిటోరియో కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీసీ రాజారెడ్డి కరాటే పోటీలను ప్రారంభించి ప్రతిభ చాటిన కరాటే విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కరాటే అసోసియేషన్ ఏపీ అధ్యక్షుడు కోలా ప్రతాప్, నెహ్రూ ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్ హెచ్ఎం కోడూరు కమల్‌తేజారెడ్డి, డైరక్టర్ రవితేజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు బందోబస్తు మధ్య వేలం

### పెరిగిన పంచాయతీ ఆదాయం


వేలం పాటలో పాల్గొన్న ఎస్ఐ, డీఎల్పీవో

**చాగలమర్రి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** చాగలమర్రి మేజర్ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి పర్యవేక్షణలో ఉయ్యాలవాడ ఎస్ఐ వెంకటేశ్వర్లు, డీఎల్పీవో రాంబాబు పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు మధ్య వేలం పాటలు ప్రశాంతంగా నిర్వహించారు. వేలం పాటలో పాల్గొనేవారు ముందుగా డిపాజిట్ చెల్లించారు. 2024-25 రూ.10.10 లక్షలు, 2025-26 ఏడాదిలో రూ.16.11 లక్షలు వేలం పాట జరిగినట్లు ఈవో తాహిర్‌హుసేన్ తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.6.11 లక్షలు ఆదాయం వచ్చిందని అన్నారు. బస్టాండు రూ.10.50 లక్షలు, వారపు సంత రూ.2.62 లక్షలు, కబేళా రూ.1.20 లక్షలు, దినమార్కెట్ రూ.1.21 లక్షలు, 14 గదులకు రూ.58,700 వేలం పాట జరిగినట్లు ఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నబీసాహేబ్, పంచాయతీ సహాయ అధికారి నాగమణి, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

**బనగానపల్లె:** పట్టణంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం వేలం పాటలు నిర్వహించినట్లు బనగానపల్లె గ్రామ పంచాయతీ ఈవో సతీశ్‌రెడ్డి తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను దినవారపు మార్కెట్ ద్వారా రూ.20.12లక్షలు, వాహనాల స్టాండ్ వేలం పాటలో రూ.20లక్షలు, జంతు వధశాల రూ.2లక్షలకు పాటపాడి పాటదారులు దక్కించుకున్నట్లు ఈవో తెలిపారు. గత ఆర్థిక సంవత్సరానికి రూ.36లక్షల 8వేలు గ్రామ పంచాయతీకి వేలం పాటల ద్వారా ఆదాయం రాగా ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.42లక్షల 12వేలు ఆదాయం లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డోన్ డివిజనల్ పంచాయతీ అధికారి బాలకృష్ణుడు, సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ, ఉపసర్పంచ్ బురానుద్దీన్, పలుకూరు ఈవో బాలాంజనేయులు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

**శిరివెళ్ల:** గ్రామ పంచాయతీ పరిధిలోని వారపు సంతమార్కెట్‌కు అధికారులు గురువారం బహిరంగ వేలంపాట నిర్వహించారు. వారపు సంతకు గత ఏడాది రూ.8.68 లక్షలు రాగా ఈ ఏడాది రూ.7.5 లక్షల ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి అశ్విన్ కుమార్ తెలిపారు. డీఎల్పీవో రాంబాబు అధ్యక్షతన ఈ వేలంపాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**రుద్రవరం:** రుద్రవరం మేజరు పంచాయతీలో గురువారం సాయంత్రం డీఎల్‌పీవో రాంబాబు వేలం నిర్వహించారు. ఈ వేలాల్లో వారసంత మార్కెట్ రూ.8లక్షలా 5వేలు, దిన మార్కెట్ 4.65 లక్షలు, కబేళా మార్కెట్ రూ.9వేలు వేలం నిర్వహించారు. గత ఏడాది వారసంత మార్కెట్ 9లక్షలు, దిన మార్కెట్ రూ.3.71లక్షలు, కబేళా మార్కెట్ రూ.8,200 వేలం నిర్వహించారు. ఈ ఏడాది మార్కెట్ వేలాల్లో రూ.3200 ఆదాయం తగ్గిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు పాల్గొన్నారు.

**బేతంచెర్ల:** బేతంచెర్ల నగర పంచాయతీ బహిరంగ వేలం పాటలను ఈ నెల 29న నిర్వహించనున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ గురువారం తెలిపారు. 2025-26 ఏడాదికి సంబందించిన ఈ వేలం పాటల్లో బేతంచెర్ల నగర పంచాయతీ దిన వారి, వారపు సంత మార్కెట్, బండ్లమెట్ట, కమేలా రుసుములను వసూలు చేసేందుకు బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేలం పాటలు శనివారం ఉదయం 10.30 గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలాల్లో పాల్గొనే పాటాదారులు దరావతులు చెల్లించి బహిరంగ వేలాల్లో పాల్గొనాలన్నారు.


రుద్రవరంలో మార్కెట్ వేలం నిర్వహిస్తున్న డీఎల్‌పీవో రాంబాబు

## విజేతలకు నగదు అందజేత


విజేతలకు నగదు అందజేస్తున్న దాతలు

**చాగలమర్రి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** చాగలమర్రి గ్రామంలోని వాసవీ జూనియర్ కళాశాలలో ఈనెల 23న నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన ఆధ్యాత్మిక, పౌరాణిక, మహాభారతం, భాగవతం పోటీ పరీక్షల్లో విజేతలకు నగదును గురువారం దాతలు పంపిణీ చేశారు. మొదటి బహుమతి పీవీ జశ్వంత్‌కు రూ.5,116, రెండో బహుమతి సత్యవతికి రూ.2,516, మూడవ బహుమతి నాగేశ్వరమ్మకు 1,516, నాల్గో బహుమతి అంజనేయరెడ్డిలకు రూ.1,116 నగదును దాతలు పోలిశెట్టి, మురళీకృష్ణ, రవింద్రారెడ్డి, వెంకటసుబ్రమణ్యం నగదు అందజేశారు. విజేతలను అభినందించారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ శ్యాబుద్దీన్ పాల్గొన్నారు.

## రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

**చాగలమర్రి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** గ్రామాల్లో పల్లె పండుగ సందర్భంగా ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేస్తున్న రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని జిల్లా క్వాలిటీ కంట్రోల్ డీఈ మోహన్‌రావు హెచ్చరించారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని గుంతపాలెం, భూమానగర్‌లలో రూ.30 లక్షలతో వేసిన సీసీ రోడ్డు పనుల నాణ్యతను పరిశీలించారు. చిన్నబోధనం గ్రామంలో రూ.15 లక్షలతో చేపట్టిన మూడు రోడ్డు పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు పనుల్లో నాణ్యత లోపించకుండా పనులు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఈలు నాగలక్ష్మయ్య, కొండారెడ్డి, ఇంజనీరింగ్ సహాయకులు ఉన్నారు.

## రీ సర్వేపై గ్రామసభ

**సంజామల, మార్చి 27:** ఇటీవల జరిగిన రీ సర్వేపై మండలంలోని హోత్రమాన్‌దిన్నెలో గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది గ్రామ సభలో పాల్గొని రీ సర్వే వివరాలను గ్రామ రైతులకు తెలియజేశారు. రీ సర్వేలో గ్రౌండ్ వ్యాలీడిటికి సంబంధించి వివరాలను రైతులకు తెలిపారు. రీ సర్వేలో జరిగిన భూ కొలతల్లో ఏమైనా సమస్యలుంటే నిర్ధారించుకోవాలని తహసీల్దార్ కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌డీటీ తులసిక్రిష్ణ, మండల సర్వేయర్లు మల్లేశ్వరి, కృష్ణయ్య, సచివాలయ సర్వేయర్లు, వీఆర్వో చెన్నయ్య, రైతులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం


డిక్లరేషన్ ఫారం చూపిస్తున్న ఉప సర్పంచ్ షేక్ బందె నవాజ్

**డోన్ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని కొత్తపల్లి గ్రామ ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నికల అధికారిగా ఈవోఆర్‌డీ ఫకృద్దీన్ వ్యవహరించారు. గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఉప సర్పంచుగా ఒకటో వార్డు సభ్యులు షేక్ బందే నవాజ్ పోటీ చేయగా.. హాజరైన 8 మంది పాలకవర్గ సభ్యులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఈవోఆర్‌డీ ఫకృద్దీన్ అన్నారు. సర్పంచుతో పాటు. మొత్తం పాలకవర్గ సభ్యులు 8 మంది ఉండగా.. ఇద్దరు గైర్హాజరు కాగా, 8 మంది మాత్రమే ఉప సర్పంచుగా అభ్యర్థిగా షేక్ బందెనవాజ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో ఉప సర్పంచ్‌గా ఎన్నికైన బందెనవాజ్ ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బాణాసంచా కాల్చి సంతోషం జరుపుకున్నారు. కార్యక్రమంలో గ్రామం టీడీపీ నాయకులు మిన్నెల్ల, నబీ రసూల్, ఉంగరాని గుండ్ల నాయకులు చిన్నమద్ది, సీసంగుంతల గ్రామానికి చెందిన రామిరెడ్డి, కొత్తపల్లె గ్రామ నాయకులు పెద్దయ్య, మద్దయ్య, ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

## సారా విక్రయాలపై దాడులు

**కొలిమిగుండ్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) :** బనగానపల్లె నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో గురువారం నాటుసారా స్థావారాలపై విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి తెలిపారు. కొలిమిగుండ్ల మండలంలోని చింతలాయపల్లె, కొలిమిగుండ్ల, కొండమనాయనపల్లె, ఇల్లూరు కొత్తపేట తదితర గ్రామాల్లో సారా విక్రయదారుల ఇళ్లపై దాడులు చేశారు. చింతలాయపల్లె గ్రామానికి చెందిన శివరాముడు నుండి 40లీటర్లు నాటుసారా, మోటార్‌సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కొలిమిగుండ్లకు చెందిన చీకటి ఉషాకుమార్ నుండి 30లీటర్లు నాటుసారా, ఇల్లూరు కొత్తపేటకు చెందిన వెంకటలక్ష్మమ్మ నుండి 10లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈదాడుల్లో ఎస్ఐ కమలాకర్, నంద్యాల టాస్క్‌ఫోర్స్ సీఐ లక్ష్మణదాస్, ఎస్ఐ రమేష్ పోలీసులు పాల్గొన్నారు.